సాక్షి
జోగులాంబ గద్వాల
గురువారం । 1 । ఆగస్టు । 2024



బదిలీల గందరగోళం

దేవాదాయశాఖ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం నెలకొంది.

వివరాలు 8లో ▸



మునిగిన పుష్కరఘాట్లు

బీచుపల్లిలో కృష్ణా పుష్కరఘాట్లు వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
28.7 /27.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పండ్ల తోటల సాగుతో అధిక లాభాలు



మల్దకల్: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించే పండ్ల తోటలను రైతులు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి అక్బర్ అన్నారు. బుధవారం మండలంలోని శేషంపల్లిలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్లతోటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సుధాకర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు వివిధ పంటల సాగుతో పాటు పండ్ల తోటలపై దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామంలో రైతులు సాగు చేసిన మామిడి, బత్తాయి తోట, చీనీ తోటలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పంటలను ఆశించే చీడపీడలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసాచారి, రైతులు తిమ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పాపిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి,రైతులు పాల్గొన్నారు.

రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి



ధరూరు: రైతులు రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలని గద్వాల ఏడీఏ సంగీతలక్ష్మీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ అండ్ పెస్టిసీడ్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆగస్టు 5వ తేదీ లోగా ప్రతి ఒక్కరు రైతు బీమా కొరకు ఏఓలతో పాటు ఏఈఓలను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి షాప్ వద్ద విధిగా స్టాక్ బోర్డుతో పాటు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నిర్ణీత ధరలకే విక్రయించాలని సూచించారు. నకిలీకి తావు లేకుండా నాణ్యమైన ఎరువులు, మందులు రైతులకు అందించాలన్నారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. గోదాముల్లో ఉన్న స్టాక్‌లను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్ట రిత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించిన రుణ మాఫీలో రూ.1.50లక్షల మాఫీలో అర్హత ఉండి లిస్టులో పేరు లేని వారు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణ మాఫీ పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,299

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 2595 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6299, కనిష్టం రూ. 2011, సరాసరి రూ. 5299 ధరలు పలికాయి.

ఘాటు తగ్గని ఉల్లి

దేవరకద్ర: ఉల్లి ధరల ఘాటు పెరగడం తప్ప దిగి రావడం లేదు. సీజన్ ముగిసి దిగుబడులు తగ్గిన తర్వాత ఉల్లి ధర పైపైకి ఎగబాకుతుంది. ఈ ఏడాది జనవరి నుంచి మే మొదటి వారం వరకు రూ. 2వేలు దాటని ఉల్లి ధర మే తర్వాత రూ. 2,500 దాటింది. జూన్ రెండో వారం నుంచి ఒక్కసారిగా ఉల్లి ధరలు ఎగిసి పడ్డాయి. ఏకంగా రూ.3వేల మార్కు దాటి పోయింది. జూలై ముగుస్తున్న ధరలు మాత్రం తగ్గడం లేదు. సీజన్ ముగిసిన తర్వాత ధరలు పెరుగుతాయని భావించిన కొందరు రైతులు నిల్వ చేసుకుని ప్రతి వారం కొంత అమ్మకానికి తెస్తున్నారు. దీంతో రైతులు రెండింతల లాభాలను పొందుతున్నారు. స్థానిక మార్కెట్‌కు బుధవారం వివిధ గ్రామాల నుంచి రైతులు 500బస్తాల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. స్థానిక వ్యాపారులతో పాటు బయట నుంచి వచ్చిన వ్యాపారులు, చిరు వ్యాపారులు సైతం వేలంలో పాల్గొన్నారు. పోటాపోటీగా జరిగిన వేలంలో ఉల్లి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 3,310 పలికింది. కనిష్టంగా రూ.2,670 వరకు ధర లభించింది. చిన్నగా ఉన్న ఉల్లి గరిష్టంగా రూ.2,500 వరకు ధర వచ్చింది. మార్కెట్ నిబంధనల ప్రకారం ఉల్లిని ఇక్కడ 45 కేజీల బస్తాలుగా తూకం వేస్తారు. ఉల్లి బస్తా ధర గర్షిష్టంగా రూ.1,650, కనిష్టంగా రూ.1,400 విక్రయించారు. చిన్న ఉల్లి బస్తా ధర రూ. 1,250 వరకు అమ్మకాలు సాగించారు. దేవరకద్ర సంతలో ఉల్లి కేజీ రూ. 50వరకు విక్రయించారు.



జూరాలకు భారీగా వరద రావడంతో పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

14 రోజులు.. 221 టీఎంసీలు

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద

- ఉమ్మడి జిల్లాలోని సాగునీటి వనరులకు 14 టీఎంసీల పంపింగ్
- కృష్ణానదిలోకి 207 టీఎంసీలు వదిలేసిన అధికారులు
- జెన్‌కో జలవిద్యుత్ కేంద్రాల్లో 66.54 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- వరద ఎక్కువగా ఉండడంతో దిగువ కేంద్రంలో విద్యుదుత్పత్తికి అంతరాయం

గద్వాల రూరల్: ఉమ్మడి జిల్లా వరప్రదాయిని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకధాటిగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారీగా వరద పోటెత్తుతోంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ఎత్తిపోస్తూ.. ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. జూరాలకు జూలై 17న వరద మొదలవ్వగా.. ఇప్పటి వరకు 221 టీఎంసీల నీరు వచ్చింది. అందులో 14 టీఎంసీలను ఒడిసిపట్టుకోగా.. మిగతా 207 టీఎంసీలను నదిలోకి వదిలేశారు. అదేవిధంగా ఎగువ, దిగువ జలవిద్యుత్ ప్రాజెక్టుల ద్వారా 66.54 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశారు.

జూలై 20న తొలిసారి గేట్ల ఎత్తివేత

జూరాలకు వరద మొదలై మంగళవారం నాటికి 14 రోజులు కాగా.. ఇప్పటి వరకు సుమారు 221 టీఎంసీల వరద వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అందులో కేవలం 14 టీఎంసీలను మాత్రమే ఉమ్మడి జిల్లాలోని నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ప్రాజెక్టులకు ఎత్తిపోశారు. మిగిలిన 207 టీఎంసీలను కృష్ణానదిలోకి వదిలేశారు. కాగా.. ఈ సీజన్‌లో తొలిసారిగా జూలై 20వ తేదీన జూరాల క్రస్టు గేట్లు ఎత్తగా.. 25వ తేదీన అత్యధికంగా 46 క్రస్టుగేట్లు ఎత్తి శ్రీశైలానికి నీటిని విడుదల చేశారు.

గరిష్టంగా 3.18 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..


గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జూరాల ప్రాజెక్టుకు పెద్దగా వరద రాలేదు. ఈ ఏడాది వానాకాలంలో ఎగువనున్న మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్‌లోకి భారీగా వరద చేరుతోంది. మహారాష్ట్రలోని ఉజ్జయిని, కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుంచి దిగువనున్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. మన రాష్ట్రంలో కృష్ణాబేసిన్‌లో ఉన్న తొలి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల పాజెక్టుకు జూలై 17వ తేదీ నుంచి వరద మొదలైంది. అప్పటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ప్రాజెక్టుకు గరిష్టంగా 3.18 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు గరిష్టంగా గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి నీటిని విడుదల చేస్తున్నారు.



నెట్టెంపాడు ఎత్తిపోతల భాగమైన గుడ్డెందొడ్డి జలాశయానికి నీటి పంపింగ్

ఎగువ, దిగువ హైడల్ ప్రాజెక్టులలో విద్యుదుత్పత్తి..

జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరడంతో ఎగువ, దిగువ జలవిద్యుత్ ప్రాజెక్టులలో విద్యుదుత్పత్తిని చేపట్టారు. ఎగువ జలవిద్యుత్ కేంద్రంలో మంగళవారం నాటికి 5 యూనిట్ల ద్వారా 33.390 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేశారు. అదేవిధంగా దిగువ జలవిద్యుత్ కేంద్రంలో పది రోజుల పాటు 33.150 మెగావాట్ల విద్యుదుత్పత్తి అయింది. దిగువ జలవిద్యుత్ కేంద్రంలోకి భారీగా వరదనీరు వచ్చి చేరడంతో నాలుగు రోజులుగా విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది.



జూరాల దిగువ జలవిద్యుత్ కేంద్రం

సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటి వరకు నీటి విడుదల ఇలా..

ప్రాజెక్టు	టీఎంసీలు
నెట్టెంపాడు	2.45
భీమా-1	2.60
భీమా-2	1.76
కోయిల్‌సాగర్	0.65
కల్వకుర్తి ఎత్తిపోతల	5
జూరాల కుడి, ఎడమ, సమాంతర కాల్వలకు	1.50

207 టీఎంసీలు వదిలేశాం..

జూరాలకు ప్రాజెక్టుకు జూలై 17 నుంచి వరద మొదలైంది. ఇప్పటి వరకు 221 టీఎంసీల వరదనీరు వచ్చి చేరింది. అందులో 14 టీఎంసీలు సాగునీటి ప్రాజెక్టులకు వినియోగించుకున్నాం. మిగిలిన 207 టీఎంసీల వరదను నదిలోకి వదిలేశాం.

– జుబేర్, ఈఈ పీజేపీ డ్యాం

గ్రామాలకు బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

అలంపూర్: ఉండవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు పునరుద్ధరించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బుధవారం లేఖలు రాసినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ర్నూల్ ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం మా స్వగ్రామమైన కంచుపాడుకు ఉండవెల్లి మండల కేంద్రానికి 3 కి.మీ దూరంలో ఉన్నప్పటికి బస్సు సౌకర్యం లేదని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జిల్లా కేంద్రానికి కంచుపాడు 20 నుంచి 25 కి.మీ దూరంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం లేదని పేర్కొన్నారు. గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం ఉండటంతో కర్నూల్ నుంచి అలంపూర్ చౌరస్తా, బూడిపాడు చౌరస్తా, ఉండవెల్లి, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల, చండూరు, జల్లాపురం మీదుగా 44వ జాతీయ రహదారి ఎర్రవల్లి చౌరస్తా ద్వార గద్వాల వరకు బస్సులు నడపడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా గద్వాల-మారమునగాల, ఉండవెల్లి, కర్నూల్‌కు రోజుకు రెండేసి ట్రిప్పులు నడపాలని మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరగౌడ్, సురవరం లోకేశ్వర్ రెడ్డి, నాగేష్, సురవరం కపిల్, రవి, సూర్యవీరా, శివబ్రహ్మ తెలిపారు.

తల్లిపాలే శ్రేయస్కరం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- వారం రోజుల పాటు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన
- జిల్లాలో 713అంగన్‌వాడీ కేంద్రాలు



తల్లిపాల వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు (ఫైల్)

గద్వాల అర్బన్: పిల్లలకు తల్లిపాల కంటే శ్రేష్ఠమైనవి ఈ సృష్టిలో ఏవీ లేవు. ఈ ముర్రుపాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించేందుకు ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తుంది. సమగ్ర శిశు అభివృద్ధి సేవా సంస్థ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దీనిపై వారం రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి గర్భిణులు, బాలింతలకు వివరిస్తారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా.. రోగనిరోధక శక్తిని పొందాలంటే తల్లిపాలు పట్టించాల్సిందేనని.. తల్లిపాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిలో ఉన్న పోషకాలు.. విశిష్టతలను ప్రతి ఒక్కరికి తెలియజేసేలా వివరిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ కాన్పు కాగానే పుట్టిన బిడ్డకు తల్లిపాలు(ముర్రుపాలు)ను ఇవ్వరు.

ఎన్నో ప్రయోజనాలు..

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయి. తల్లి బిడ్డకు జన్మనిచ్చిన తరువాత గంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలి. తల్లి, బిడ్డ మధ్య అనుబంధాన్ని పెంచేవి తల్లిపాలు ఒక్కటే. ముఖ్యంగా బిడ్డ పుట్టిన మొదటి ఆరునెలలు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలి. ఆ తర్వాత మరో సంవత్సరం పాటు పట్టిస్తే మంచిది. కూరగాయాలు, పండ్లు, పప్పుధాన్యాలు, ప్రొటీన్స్ వంటివి పిల్లలకు చాల మంచివి.వాటితో పాటు తల్లిపాలు శిశువుకు సమతుల్య పోషకాలు అందిస్తాయి. కావాల్సిన విటమిన్స్, ప్రొటీన్స్, ఫ్యాట్ వంటివి తల్లిపాల వల్లే లభిస్తాయి. నేటి నుంచి అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో ప్రత్యేకంగా ర్యాలీలు, పోస్టర్లు, సదస్సులు చేపట్టి ముర్రుపాలే ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన పోషకాహారాలు, గర్భిణులు, బాలింతలు పాటించాల్సిన వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సూత్రాలు, తల్లిపాల ప్రయోజనాలపై వివరిస్తారు. అంగన్‌వాడీ టీచర్లు, ఐసీసీఎస్ అధికారులు, ఆశలు, హెల్త్‌ సిబ్బంది బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లాలోని గద్వాల, ధరూరు, కేటిదొడ్డి, గట్టు, మల్దకల్, అయిజ, శాంతినగర్, వడ్డేపల్లి, అలంపూర్, ఉండవెల్లి, మానపాడు, ఇటిక్యాల మండలాల పరిధిలో కలిపి మూడు అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 713అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. గర్భిణులు 5766మంది, బాలింతలు 3,533, ఉన్నారు. అదేవిధంగా మూడు ప్రాజెక్టులో ఆరు ఏళ్ల లోపు చిన్నారులు 54,186మంది ఉన్నారు.


ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం..

ఈనెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1వ తేదీన గ్రామ, వార్డు స్థాయిల్లో వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ కార్యక్రమం నిర్వహిస్తారు. 2వ తేదీన 6నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రం ఇవ్వడంపై అవగాహన కల్పిస్తారు. 3వ తేదీన గ్రామ, వార్డు స్థాయిల్లో అన్నప్రాసన అనుబంధ పోషక కార్యక్రమం, 5వ, 6వ తేదీల్లో 0-24నెలల వయస్సు పిల్లల గృహ సందర్శనలు, తల్లిపాలు ఇవ్వడం, పోషకాహార ప్రాముఖ్యత, తల్లిపాలు ఇవ్వడం, పద్ధతులు, హ్యాండ్ వాష్ డెమోనిస్ట్రేషన్స్, 7వ తేదీ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక బృందాలతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తారు.

జిల్లా వివరాలిలా..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
గద్వాల అర్బన్	262	1,965	1,293	18,270
మల్దకల్	213	930	1,228	19,720
మానవపాడు	238	1,871	1,011	16,196

రోగనిరోధక శక్తి పెంపు..



తల్లిపాలతో పోషకాలతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బిడ్డకు తల్లి పాలు తప్పకుండా అందించాలి. పుట్టిన గంటలోపు తల్లిపాలు తప్పనిసరి. బిడ్డ పుట్టిన ఆరు నెలలు పాటు తల్లిపాలు మినహా మరే పదార్థం అందించకూడదు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతాం. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తాం. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకొని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి.

– సుధారాణి, డీడబ్ల్యూఓ, గద్వాల

అంగన్‌వాడీల బలోపేతానికి చర్యలు

గద్వాల రూరల్: అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. బుధవారం ఆయన గద్వాల మండలంలోని శెట్టిఆత్మకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన కేంద్రంలో ఉన్న విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న మెనూ అంశాలను అడిగి తెలుసుకున్నారు. మూడు ఏళ్లలోపు ఉన్న పిల్లలకు బాలమృతం అందించాలని, అదే విధంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగించేలా ఖచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. మండలానికి ఒక అంగన్‌వాడీని ఎంపిక చేసి వాటిని మోడల్‌గా తీర్చిదిద్దే ప్రక్రియను త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూవో సుధారాణి, పీఆర్ ఈఈ దామోదర్, డీఈ రాజేష్, ఎంపీడీవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని అయితే వారు ప్రజలకు అందించే సేవలే గుర్తింపునిస్తాయని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన మునిని వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు 1995లో ప్రభుత్వ ఉద్యోగిగా చేరారని, 29సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించి ప్రజల మన్నన పొందారన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌ను.. కలెక్టర్, జిల్లా అధికారులు, సిబ్బంది సన్మానం చేశారు.

మెడికల్ కళాశాలకు ఎంసీఐ అనుమతులు

గద్వాల ప్రభుత్వ మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కౌన్సిల్ నుంచి అనుమతులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

ధరూరు: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని.. నష్టం వాటిల్లకుండా సంబంధిత సీడ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దపాడు గ్రామ శివారులో రైతులు సాతు చేసిన పత్తి పంటను ఆయన జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి పంటను పరిశీలించారు. పత్తి విత్తనాలు సరఫరా చేసే సీడ్ కంపెనీలు రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు చేయాలన్నారు. రైతులు నష్టపోకుండా ముందస్తుగా సస్యరక్షణ చర్యలపై వివరించే కార్యక్రమాలు చేయాలన్నారు. దానికి తోడు వ్యవసాయ శాక అధికారులు అందుబాటులో ఉండి రైతులకు సలహాలు ఇవ్వాలని అన్నారు. రైతులు పండించే పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అలాగే రైతు బంధు అందే విధంగా ఆన్‌లైన్ పంట నమోదు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓ స్వరూప, మాజీ సర్పంచు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గద్వాల మండలం శెట్టిఆత్మకూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ఆర్థిక వనరులను సమకూర్చుకోవాలి

గట్టు: చెత్త నిర్వహణను పకడ్బందీగా చేపట్టి తడి, పొడి చెత్తలను వేరుచేస్తూ వాటి ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ నర్సింగరావ్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని గంగమాన్‌దొడ్డి, బస్వాపురం గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, వైకుంఠధామాలు, ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. అలాగే, పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీలు స్వయం పోషకాలుగా తయారు కావాలని చెప్పారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామాల పరిధిలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలన్నారు.



బస్సాపురంలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

ఉమ్మడి జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పలువురికి స్థానచలనం కలిగింది. సదాశివపేటలో ఎస్‌ఆర్‌ఓగా పనిచేస్తున్న మహ్మద్ హమీద్ మహబూబ్‌నగర్‌కు జాయింట్ ఎస్‌ఆర్‌ఓ-1గా వస్తున్నారు. నాగర్‌కర్నూల్ ఎస్‌ఆర్‌ఓ జి.మౌనిక అలంపూర్ (ఎస్‌ఆర్)కు, మహబూబ్‌నగర్‌లో ఏఆర్‌సీగా పనిచేస్తున్న ఆర్. సంధ్యారాణి, ఇక్కడికే జాయింట్ ఎస్‌ఆర్‌ఓ-2గా వస్తున్నారు. అచ్చంపేట ఎస్‌ఆర్‌ఓ బి.సమ్మయ్య జడ్చర్ల (ఎస్‌ఆర్)కు, రంగారెడ్డి జిల్లాలో జాయింట్ ఎస్‌ఆర్‌ఓ-2గా పనిచేస్తున్న కె.ఆంజనేయులును మహబూబ్‌నగర్ ఏఆర్‌సీగా బదిలీ చేశారు. అలంపూర్ ఎస్‌ఆర్‌ఓ ముబషిర్ అహ్మద్‌ను గద్వాల ఎస్‌ఆర్‌గా, ఇక్కడ ఎస్‌ఆర్‌ఓగా పనిచేస్తున్న ఎం.చంద్రశేఖర్ రెడ్డిని వనపర్తి ఎస్‌ఆర్‌గా పంపిస్తున్నారు. ఆజంపురా ఎస్‌ఆర్‌ఓ బి.ఆనంద్ కల్వకుర్తి ఎస్‌ఆర్‌గా, కొల్లాపూర్‌లో ఎస్‌ఆర్‌ఓ మహ్మద్ అఫ్జలుద్దీన్ నాగర్‌కర్నూల్ ఎస్‌ఆర్‌గా వెళ్తున్నారు. కల్వకుర్తిలో ఎస్‌ఆర్‌ఓగా పనిచేస్తున్న టి.సింధూజయాదవ్ హైదరాబాద్‌లోని కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (సీ అండ్ ఐజీ) కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఇక ఇంతవరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వని ఎ.క్రిస్టాఫర్‌ను అచ్చంపేటకు ఎస్‌ఆర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ - స్టాంప్స్ డా. జ్యోతి బుద్ధప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

ఆగిన లారీని ఢీకొట్టిన మరో లారీ

● క్లీనర్ మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

మానవపాడు: జాతీయ రహదారి–44పై ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి మరో లారీ ఢీ కొనడంతో క్లీనర్ మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బుధవారం ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపినా వివరాల ప్రకారం .. నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం, రామకృష్ణకు చెందిన క్లీనర్ రమణయ్య (55), లారీ డ్రైవర్‌తో కలిసి జూలై 27వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ బేతంచర్ల నుంచి తెలంగాణలోని తాండూరుకు లారీలో బండలలోడ్‌తో బయలుదేరారు. తాండూరులో అన్‌లోడ్ చేసి అక్కడి నుంచి జూలై 30వ తేదీన తాండూరు బండలను లోడ్ చేసుకోని బేతంచర్లకు తిరుగు ప్రయాణం అయ్యారు. మంగళవారం రాత్రి జాతీయ రహదారి–44పై బోరవెల్లి స్టేజి సమీపంలో పూర్తిగా పక్కకు ఓ లారీని నిలిపి ఉంచారు. కాగా ఈ లారీ వెనుక వైపు నుంచి ఢీకొనడంతో క్లీనర్ రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో భార్య రమాదేవి పిర్యాదు మేరకు వెనుక వైపు నుంచి ఢీ కొన్న లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చంద్రయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని చర్లపల్లి శివారులో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లికి చెందిన కావలి చంద్రయ్య(49)కు కొత్తకోట మండలం చర్లపల్లికి చెందిన అల్లెమ్మతో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి చర్లపల్లిలోనే ఉంటూ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అల్లెమ్మ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. కావలి చంద్రయ్య కొంత కాలంగా గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి వద్ద వ్యవసాయ పనులు, మామిడి తోట పనులు చూసుకుంటుండేవాడు. పనిలో భాగంగా బుధవారం ఉదయం వరి చేను చూసేందుకు వెళ్లి పక్క పొలం రైతుకు చెందిన విద్యుత్ తీగకు గల వైర్ కింద పడటంతో పక్కకు తీసే క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు కావలి నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు పాడి గేదెలు మృతి

ధరూరు: విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. మండలంలోని ఓబులోనిపల్లి చెందిన రైతు నర్సింహులు ధరూరు చెరువు కింద డబ్బల బావి వద్ద కొంత పొలాన్ని కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తున్నాడు. ఆయనకు ఏడు గేదెలు ఉన్నాయి. బుధవారం సాయంత్రం భారీ గాలులతో కూడిన వర్షం రాగా, గాలులకు వ్యవసాయ బావులకు వెళ్లిన తీగలు తెగిపోయాయి. అది గమనించని రైతు తమ గేదెలను మేత కోసం మామిడి తోటలో వదిలాడు. దీంతో షాక్‌కు గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.1.80లక్షలు ఉంటుందని రైతు తెలిపారు.

అపస్మారకస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి



ధన్వాడ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద సుమారు 50ఏళ్ల వయస్సు గల అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. బుధవారం విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆచూకి తెలిసిన వారు ధన్వాడ పోలీసులకు సమాచారం ఇవ్వాలని 8712670409 నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా కోరారు.

లైంగికదాడియత్నం కేసులో జైలు శిక్ష

కోస్గి: ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ బుధవారం జిల్లా న్యాయమూర్తి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ యోగేష్‌గౌతం తెలిపారు. గుండుమాల్ మండలంలోని గ్రామానికి చెందిన వివాహిత భర్త గుండెపోటుతో చనిపోవడంతో తన ముగ్గురు కొడుకులతో కలిసి ఓ అద్దె ఇంట్లో జీవనం సాగిస్తుంది. ఆగస్టు 14, 2019 నాడు తన కొడుకులతో ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి వివాహిత భర్తకు అన్న అయిన కర్రీ సాయప్ప తలుపు తట్టి ఆమెను నిద్రలేపాడు. తలుపులు తీసిన ఆమె చేయి పట్టుకొని లైంగిక దాడికి యత్నించడంతో ఆమె గట్టిగా అరుపులు, కేకలు వేయడంతో అక్కడ నుంచి పారిపోయాడు. మరుసటి రోజు గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టగా బాధితురాలి అత్త బుగ్గమ్మ తిట్టడంతో అదే రోజు సదరు మహిళ కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో గాయాలతో బయటపడింది. ఈ ఘటనపై అప్పట్లో కోస్గి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో సాక్షులను విచారించి కేసు పూర్వాపరాలు విన్న జిల్లా కోర్టు అసిస్టెంట్ సెషన్ న్యాయమూర్తి శ్రీనివాస్ నిందితునికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

బదిలీల గందరగోళం


మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం

అయోమయంలో దేవాదాయశాఖ ఉద్యోగులు

● ఆప్షన్స్ ఇచ్చి.. కౌన్సెలింగ్‌లు మరిచారు
● బదిలీలలో చట్టబద్ధత లేదంటున్న ఉద్యోగులు

జోగుళాంబ శక్తిపీఠం: ప్రభుత్వం దేవాదాయశాఖ ఉద్యోగులను 20 ఏళ్ల తర్వాత బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రకియలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని ఉద్యోగులు అందోళన చెందుతున్నారు. జూలై 19 వరకు బదిలీల కోసం ఆప్షన్స్ ప్రక్రియ ముగిసింది. ఆలయాల ఉద్యోగులు ఒకే చోట ఎంత కాలం నుంచి పని చేస్తున్నారు? ఏదేని వివాదాలు ఉన్నాయా? ఇలా అనేక కోణాలలో పరిశీలించేందుకు వారి సర్టిఫికేట్ల పరిశీలనకు ప్రతి ఆలయం నుంచి సంబంధిత ఈఓ, జిల్లా సహాయ కమిషనర్‌లతో కూడిన కమిటీని నియమించింది. కాగా జూలై 29 లోపు బదిలీల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా మళ్లీ ఆగస్టు 5వ తేదీ వరకు పొడిగించారు. ప్రస్తుతం జూ.అసిస్టెంట్, సీ.అసిస్టెంట్, సూపరింటెండెంట్‌లకు మాత్రమే, అది కూడా 40శాతం ఉద్యోగులకు బదిలీలు చేపడుతున్నారు.

గందరగోళానికి కారణం ఇదే..

బదిలీలలో భాగంగా ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం 5 చోట్ల స్థానం కోరుకునే విధంగా ఆప్షన్స్ ఇచ్చారు. ఆప్షన్స్‌కు వీలుగా కౌన్సెలింగ్ ద్వారా సీనియార్టీ ప్రకారం ఎంపిక చేసుకునే వెసులుబాటును కల్పించాల్సి ఉంది. కాగా నిబంధనలకు విరుద్ధంగా అధికారులే సొంత నిర్ణయం తీసుకుని బదిలీలను చేపడుతున్నారని సమాచారం. బదిలీల అంశంలో 40 శాతం నిబంధనల ప్రకారం ఆలయాల చొప్పున తీసుకుంటే కొన్ని ఆలయాల్లో ఒక్కరే ఉన్నారు. సీనియార్టీని పరిగణలోకి తీసుకుని వారిని బదిలీ చేస్తే అప్పుడు 100శాతం కిందికి వస్తుందని, 40 శాతం కిందికి ఎలా వస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు గద్వాల జిల్లాలో 6–బి కింద పాగుంట వెంకటేశ్వర ఆలయం, పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయాలు మాత్రమే ఉన్నాయి. పాగుంటలో ఒక్కరే క్లర్కు ఉండగా చింతరేవులలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. మరి ఇలాంటి సమయంలో పాగుంటలో ఉన్న ఒక్క క్లర్కును బదిలీ చేస్తే అక్కడి పరిపాలనలో ఇబ్బందులు వస్తాయి. పైగా 40 శాతం నిబంధనలకు విరుద్ధమవుతుంది. ఉమ్మడి జిల్లాలో సూపరింటెండెంట్‌ల విషయానికి వస్తే మన్యంకొండలో ఒకరే ఉన్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్‌ల విషయానికి వస్తే కురుమూర్తి దేవస్థానం, అలంపూర్ దేవస్థానంలో మాత్రమే ఇద్దరు ఉన్నారు. 40 శాతం నిబంధనలో వీరికి ఈ బదిలీలు వర్తించడం లేదు. దీంతో వీరు చాలా కాలంగా ఒకే చోట పాతుకుపోయారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు, ఉద్యోగులు, 40శాతం బదిలీ అయ్యేవారి సంఖ్య

జిల్లా పేరు	6ఏ ఉద్యోగులు	బదిలి అయ్యే వారు	6బి ఉద్యోగులు	బదిలీ అయ్యే వారు
మ. నగర్	8	3	11	4
గద్వాల	14	6	1	0
నాగర్‌కర్నూలు	15	6	1	0
వనపర్తి	0	0	0	0
నారాయణపేట	0	0	2	1
మొత్తం	37	15	15	5

బదిలీలు త్వరితగతిన చేయాలి



ఇప్పటికే సాధారణ బదిలీలు 16 ఏళ్లుగా నిలిచి పోయాయి. ఇంత కాలం తర్వాత చేపట్టే బదిలీలలో మళ్లీ జాప్యం కాకుండా ఉద్యోగులకు ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. 40 శాతం బదిలీల ప్రకారం జరగాల్సిన బదిలీలు త్వరితగతిన చేస్తే బాగుంటుంది.
– శేఖర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్, అలంపూర్, గద్వాల జిల్లా

అధికారుల నిర్ణయం మంచిదే..



చాలాకాలం తర్వాత దేవదాయశాఖ కమిషనర్ ఆలయ ఉద్యోగులను బదిలీ చేస్తూ నిర్ణయించడం స్వాగతించదగ్గ విషయం. అయితే నిబంధనల ప్రకారం ఆప్షన్స్ ఇచ్చారు. కాబట్టి బదిలీలు చేసే ముందు ఉద్యోగులను పిలిచి కౌన్సెలింగ్ చేపట్టి వారి అభిప్రాయాలకు స్థానం కల్పిస్తే బావుంటుంది.
– రజనీకాంత్, జూ.అసిస్టెంట్ గూడెబల్లూరు, నారాయణపేట జిల్లా

5వ తేదీ వరకు పొడిగింపు



బదిలీలను ఆగస్టు 5 వరకు పొడిగించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్‌లు మాత్రమే బదిలీలు జరుగుతున్నాయి. 6ఏలో 37 మందికి గాను 15 మందిని, అలాగే 6బిలో 15 మందికి గాను ఐదుగురిని బదిలీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52 మందిలో 40శాతం నిబంధనల ప్రకారం 20 మంది బదిలీ అవుతారు.
– గాదిరాజు శ్రీనివాస్‌రాజు, జిల్లా సహాయ కమిషనర్, ఉమ్మడి మహబూబ్‌నగర్

ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి

● జూరాలకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
● 42 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/దోమలపెంట/ఆత్మకూరు: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం జూరాల ప్రాజెక్టుకు 3.10లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు 42 గేట్లను ఎత్తి 2,83,080 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇదిలా ఉండగా జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు పీజేపీ అధికారులు పేర్కొన్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 18,770 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. జూలై 31వ తేదీ వరకు 69.172 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఆవిరి రూపంలో 44, కుడి కాల్వ ద్వారా 652, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 630, భీమా లిఫ్టు–2కు 750, సమాంతర కాల్వకు 950 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,05,696 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.261 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,41,944 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 3.50లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 3.35లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 30 గేట్లను ఎత్తి 3,22,788 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

⇨ శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల, సుంకేసులతో కలిపి 3,34,252 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 8 గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 2,23,128, విద్యుదుత్పత్తి ద్వారా 60,232 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 24,083, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,600 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది.

బీచుపల్లి పుష్కరఘాట్లకు తాకిన వరద

ఎర్రవల్లిచౌరస్తా: జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు భారీగా నీటిని వదులుతున్నారు. దీంతో ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి పుష్కరఘాట్లన్ని వరద నీటిలో పూర్తిగా మునిగిపోయాయి. అదేవిధంగా నదికి వరదనీరు అధికంగా రావడంతో శివాలయం సమీపానికి చేరి ఉధృతంగా శ్రీశైలం వైపు ప్రవహిస్తుంది.


బీచుపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరకు 28 గేట్ల నుంచి కొనసాగిన ఇన్‌ఫ్లో, బుధవారం 4 గేట్లతో సాగింది. ఉదయం 17 గేట్లతో 61,931 క్యూసెక్కులు దిగువకు వదలగా, సాయంత్రం ఎగువ నుంచి 18,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా నాలుగు గేట్లు తెరిచిన అధికారులు 16,256 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలంకు వదిలి, కేసీ కెనాల్‌కు 2,354 క్యూసెక్కులు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.


సుంకేసుల జలాశయం

కుమారుడిని భయపెట్టేందుకు యత్నం

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు

కొల్లాపూర్: బడికి వెళ్లడం లేదని తన 11 సంవత్సరాల కొడుకును భయపెట్టేందుకు ఓ తండ్రి చేసిన పని కొల్లాపూర్‌లో చర్చనీయాంశంగా మారింది. స్థానికులు కథనం ప్రకారం.. పట్టణంలోని తెలుగు వీధికి చెందిన మత్స్యకారుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా పెద్ద కుమారుడు బడికి సక్రమంగా వెళ్లడం లేదు. దీనిపై పలుమార్లు తల్లిదండ్రులు మందలించారు. అయినా కూడా అతడిలో మార్పు రాలేదు. దీంతో విసుగుచెందిన తండ్రి బుధవారం సాయంకాలం ఓ పిచ్చిపనికి ఒడిగట్టాడు. బాలుడిని గోనెసంచిలో మూట గట్టి శివాలయం సమీపంలోని చెరువువద్దకు తీసుకువెళ్లాడు. సగభాగం సంచిని నీటిలో ముంచి.. రోజూ బడికి వెళ్తానంటే వదిలిపెడ్తా లేదంటే.. ముంచేస్తా అని బెదిరించాడు. బాలుడు కేకలు వేయడంతో అటువైపుగా వచ్చిన కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకొని తండ్రీ, కొడుకులను స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడి తల్లిని కూడా పిలిపించారు. కాగా పిల్లాడిని భయపెట్టి బడికి పంపాలనే ఉద్దేశంతోనే తాను ఈ పనికి ఒడిగట్టినట్లు ఆ మత్స్యకారుడు పోలీసులకు చెప్పాడు. దీంతో భార్యాభర్తలతో పాటు కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపినట్లు ఎస్‌ఐ హృషికేష్ వెల్లడించారు. పిల్లలను భయపెట్టేందుకు ఇటువంటి పిచ్చిపనులు మరోసారి చేయవద్దని సూచించామన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో షార్ట్ సర్క్యూట్

సకాలంలో స్పందించడంతో తప్పిన ప్రమాదం


కాలిపోయిన స్టార్టర్

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్ ఎస్సీ హాస్టల్‌లో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. హాస్టల్‌లోని విద్యార్థుల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన బోరు స్టార్టర్ కిచెన్‌లో బిగించారు. అవసరం ఉన్నప్పుడల్లా నీటిని వాడుకుంటారు. బుధవారం రాత్రి భోజనం అనంతరం ఎవరి గదుల్లోకి వారు వెళ్లిపోయి చదువుకుంటున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా కిచెన్‌లో ఉన్న స్టార్టర్‌కు నిప్పంటుకుంది. గమనించిన పదోతరగతి విద్యార్థులు లక్ష్మణ్, గణేష్ పరుగెత్తుకెళ్లి కిచెన్‌లో ఉన్న సిలిండర్‌ను బయటికి తీసుకొచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే మేయిన్ ఆఫ్ చేశారు. తక్షణమే చిన్నపిల్లలను అందరిని గదుల్లో నుంచి బయటికి పంపించారు. తర్వాత మంటలు ఆర్పారు. అప్పటికే స్టార్టర్ పూర్తిగా కాలిపోయింది. అక్కడే ఉన్న సిబ్బంది భాస్కర్, బాలయ్య విషయాన్ని గ్రామంలో ఉండే మరో వర్కరు అక్బర్‌కు తెలిపారు. ఆయన ఎలక్ట్రీషియన్‌ను తీసుకువచ్చి కిచెన్‌కు ఉన్న విద్యుత్ సరఫరాను తొలగించి మిగతా గదులకు సరఫరాను పునరుద్ధరించారు. విషయాన్ని వార్డెన్ మోహన్‌రెడ్డికి తెలపడంతో ఆయన ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హాస్టల్‌లో విద్యుత్ సరఫరా నిమిత్తం ట్రాన్స్‌ఫార్మర్‌లు బిగించారు. మూడు బుడ్లు ఉండగా వాటిలో రెండు కాలిపోయి కేవలం ఒక్కదాని మీద సరఫరా జరుగుతుంది. హాస్టల్ ఫ్యాన్లు, లైట్లు, మోటారు కారణంగా వినియోగం పెరిగింది. దీంతో ఒక్క దానిపై ఎక్కువలోడు పడడంతో షార్ట్ సర్క్యూట్‌కు కారణమైంది. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా సమస్య ఉన్నట్లు తమ దృష్టికి రాలేదని వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌లను మరమ్మతు చేయిస్తామని చెప్పారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు డ్రా

కల్వకుర్తి టౌన్: ఏటీఎం సెంటర్‌లో పిన్ జనరేట్ చేసుకునేందుకు వెళ్లిన యువతి కార్డు మార్చి నగదును డ్రా చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన మనీషకు తన ఏటీఎం కార్డు సమయం ముగియటంతో మరో కార్డును బ్యాంకు అధికారులు పంపించారు. కొత్త కార్డు పిన్ సెట్ చేసుకునేందుకు పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లింది. పిన్ సంబంధించి యువతికి సాయం చేస్తానని అక్కడే ఉన్న ఓ వ్యక్తి పిన్ జనరేట్ చేసిన తర్వాత అతని వద్ద ఉన్న అదే రూపంలోని మరో కార్డును యువతికి ఇచ్చాడు. యువతి కార్డును సరిగా చూసుకోక ఇంటికి వెళ్లే లోపే యువతి ఫోన్‌కు రూ.23వేలు డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. వెంటనే ఆమె తేరుకుని బ్యాంకుకు వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా, అధికారులు పరిశీలించి పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో డ్రా అయినట్లు గుర్తించారు. ఇదే తరహాలో మరో ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి రూ.28వేలు ఒకరివి, రూ.10వేలు మరొకరివి డ్రా అయినట్లుగా సమాచారం. డబ్బులు డ్రా అయిన విషయంపై యువతి బ్యాంకుతో పాటుగా, పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి


రాంనగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం రాంనగర్‌కాలనీలో డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ.. కాలనీలో అపరిచితులు, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కాలనీలో ఎవరికైనా ఇళ్లు అద్దెకు ఇచ్చే క్రమంలో వారి వ్యక్తిగత సమాచారం, చిరునామ, ఆధార్ కార్డు తదితర పత్రాలను చూడాలన్నారు. ఎవరైనా శుభకార్యాలు, దూర ప్రయాణాలకు వెళ్లే క్రమంలో పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. కాలనీలోని 230 ఇళ్లలోని వ్యక్తుల సమాచారం తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను ప్రతి ఒక్కరు కాలనీలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు సంప్రదించాలన్నారు. 30 వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ క్రీడాకారుడికి సత్కారం


జశ్వంత్‌ను సత్కరిస్తున్న సమన్వయకర్త ఖాజాబావోద్దీన్

జడ్చర్ల టౌన్: 42వ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న పట్టణంలోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి జశ్వంత్‌ను బుధవారం ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఖాజాబావోద్దీన్ సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25నుంచి 28 వరకు హర్యాణ రాష్ట్రంలోని బీవాని పట్టణంలో జరిగిన క్రీడల్లో జశ్వంత్ పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో రాష్ట్రం ద్వితీయ స్థానం సాధించిందని, అందులో జశ్వంత్ కీలక పాత్ర పోషించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్నారనే అనుమానం

పోలీసుల అదుపులో యువకులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. వీరు జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇద్దరి యువకుల నుంచి కొంత గంజాయి పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ యువకులు ఎక్కడి నుంచి గంజాయి తీసుకువచ్చి ఎవరెవరికి విక్రయాలు చేస్తున్నారనే సమాచారాన్ని పోలీసులు రాబడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గంజాయి కలిగి ఉన్న వ్యక్తులు జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన యువకులుగా తెలుస్తుంది. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్ వివరణ కోరగా విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు.

వృద్ధుడి మృతిపై అనుమానం

● అంత్యక్రియలను అడ్డుకున్న భార్యాపిల్లలు
● మృతదేహాన్ని వైకుంఠధామం నుంచి పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు


జమ్మన్న సోదరులు, బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఓ వ్యక్తి అంత్యక్రియల కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గొల్ల జమ్మన్న(65)కు, తక్కశీలకు చెందిన నాగమ్మతో 45 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా కొన్నేళ్ల తరువాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె తమ కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడే నివాసం ఉంటోంది. కాగా జమ్మన్న మండల కేంద్రంలోనే తన తమ్ముళ్లతో పాటు కలసి జీవించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 30న ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. కాగా విషయాన్ని అతడి భార్య, పిల్లలకు ఆయన సోదరులు తెలియజేయలేదు. వారే అతడి అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. కాగా విషయం అతడి భార్యా పిల్లలకు తెలిసింది. దీంతో జమ్మన్న మృతిపై అనుమానం ఉందంటూ అంత్యక్రియల కార్యక్రమాన్ని వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాగా తమ అన్నను ఇంతకాలం తామే పోషించుకున్నామని.. ఇప్పుడెందుకు వచ్చారని జమ్మన్న తమ్ముళ్లు అతడి భార్య, పిల్లలను ప్రశ్నించారు. దీంతో వారు మృతిపై తమకు అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు జమ్మన్న తముళ్లు శ్రీనివాసులు, శ్రీశైలంపై కేసునమోదు చేశారు. వైకుంఠదామం వద్ద నుంచి మృతదేహాన్ని వెనక్కి తీసుకువచ్చి పోస్టుమార్టంకు పంపించారు. అనంతరం అంత్యక్రియల బాధ్యతలను తిరిగి జమ్మన్న సోదరులకే అప్పగించారు.

విద్యార్థిని అదృశ్యం

జడ్చర్ల: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న గాయత్రి జూలై 29న అదృశ్యమైందని ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపారు. కళాశాల నుంచి మధ్యాహ్నం ఇంటికి వచ్చిన విద్యార్థిని తర్వాత బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. బుధవారం సోదరుడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అకౌంట్ల నుంచి రూ. 1.20 లక్షలు మాయం

మానవపాడు: ఒక వ్యక్తికి సంబంధించిన మూడు అకౌంట్ల నుంచి డబ్బులు మాయమైన ఘటన మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన రాఘవేంద్ర అన్న రమేష్‌తో కలిసి హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అతడి ప్రమేయం లేకుండా తన మూడు అకౌంట్ల నుంచి రూ. 1,20,000 మాయమయ్యాయి. కాగా సైబర్‌నేరగాళ్లే మాయం చేశారని బాధితుడు వాపోయాడు. క్రిష్ణకుమార్ అనే పేరుపై వస్తోందని పేర్కొన్నాడు. 1930కు కాల్ చేశానని సైబర్ క్రైమ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

చెత్తకుప్పలో మృతశిశువు లభ్యం

తెలకపల్లి: సభ్యసమాజం తలదించుకునేలా అమానవీయ ఘటన మండలంలో చోటు చేసుకుంది. మానవత్వాన్ని మరిచి ఆడశిశువు మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకుప్పలో పారవేసిన ఘటన అందరిని కలిచివేసింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అనంతసాగర్ గ్రామ అలుగు సమీపంలో రెండు, మూడు రోజుల ఆడశిశువును గ్రామస్తులు గుర్తించారు. గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ బుధవారం సాయంత్రం చేరుకుని చనిపోయి ఉన్న ఆడశిశువును ఎవరు పడేశారని గ్రామస్తులను ఆరాతీశారు. పసిబిడ్డను చెత్తకుప్పలో పారవేయడంతో స్థానికంగా ఆందోళన కలిగించింది. గతంలో తాళ్లపల్లి సమీపంలో కూడా ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. రెండు రోజుల క్రితం ఎవరో ఈ శిశువుకు పారవేసి ఉంటారని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైద్య విద్యార్థి అదృశ్యం


రవీందర్

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ చెందిన వైద్య విద్యార్థి బండ రవీందర్ అదృశ్యమయ్యాడు. సిద్దిపేట వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇరవై రోజుల క్రితం సెలవులు ఉండటంతో కోడ్గల్‌లోని ఇంటికి వచ్చాడు. మంగళవారం తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి.. మధ్యాహ్నం తర్వాత ఇంటికి వచ్చాడు. తదుపరి ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండాపోయాడు. తండ్రి మల్లయ్య బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ బాబు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఎలాన్ హోండా షోరూమ్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మంకల్ ఏరియాలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సర్వీస్ అడ్వైజర్స్, టెలికాలర్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. ఆఫీసు సమయం 9.30 AM to 7.00 PM Contact : 8498078111 [J-720249]

■ శ్రీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, హౌస్‌కీపింగ్ భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14415]

■ నూతనంగా ప్రారంభించిన మా బ్రాంచిలో జాబ్ చేయుటకు 49 స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 14,000/- + 8 వేలు DA। ఫ్రీ రూం, Qr.7th-డిగ్రీ (P/F). మహబూబ్‌నగర్. 86880 65411 [L-794246]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి, మేనేజర్